స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేలా కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ

స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని డిపిఒ రవికుమార్ ఆదేశించారు. మంగళవారం మండలం లోని మాధవపట్నం గ్రామంలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుపిసి, ఐవిఆర్ఎస్ కాల్స్, క్లోరినేషన్ రిపోర్ట్‌పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి టి.సత్యనారాయణ, ఎఇ, డిపిఆర్‌సి బృందం సభ్యుడు రాజా, సిబ్బంది పాల్గొన్నారు

ఉపాధికి ఊతమేదీ..?

- అటకెక్కిన కార్పొరేషన్ల రుణాల హామీ
- మంజూరు మాట మరచిన కూటమి సర్కార్
- దరఖాస్తుదారుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పేదల స్వయం ఉపాధికి ఉపయోగపడే సబ్సిడీ రుణాలను అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ ఒక్క రుణం మంజూరు చేయలేదు. ఆర్భాటంగా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తోంది. అదిగో ఇదిగో అంటూ ఊరిస్తోంది. ఎప్పుడు ఇచ్చేదీ తెల్చకుండా గాల్లో మేడలు కడుతోంది. రుణాల మంజూరు కోసం లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి.

ఆర్భాటంగా ప్రకటనలు

నిరుద్యోగ యువతకు ఫ్లవర్ బొకే మేకింగ్ అండ్ డేకరేషన్, వర్మీకంపోస్టు అండ్ ఆర్గానిక్ మాన్యూర్, ప్లబింగ్ అండ్ ఎలక్ట్రిషియన్ సర్వీసెస్, వాటర్ రీ సైక్లింగ్, మొబైల్ రిపేరింగ్, సోర్‌అండ్ డిటర్జంట్ మేకింగ్, వెబిల్డింగ్ అండ్ ఫాబ్రికేషన్ యూనిట్, సోలార్ ఎనర్జీ సేల్స్, ప్రమోషన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, జనరిక్ మందుల షాపులు, బ్యాటరీ ఆటోలు, బేకరీలు తదితర యూనిట్ల ద్వారా యువతకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. స్వయం ఉపాధి యూనిట్లకు 50 శాతం సబ్సిడీతో రుణం ఇప్పించాలని నిర్ణయించింది. దీంతో దరఖాస్తు పెట్టుకున్న లబ్ధిదారులు ఈ పథకం తమకే దక్కాలని అనేక మంది ఎంఎల్‌ఎలు, మంత్రులతో సిఫార్సు చేయించారు. సబ్సిడీ రుణాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా ఎంపిడిఒలు సంబంధిత బ్యాంక్ బ్రాంచ్‌లకు సిఫార్సులు చేశారు. సబ్సిడీ పోను మిగిలిన సగం రుణం కింద ఇవ్వాలని యూనిట్ల వివరాలతో పంపించారు. కానీ ఇప్పటి ఏ ఒక్కరికి రుణం మంజూరు కాలేదు. కార్పొరేషన్ల ద్వారా రుణాలిచ్చి యువతను ఆర్థికంగా బలోపేతం చేస్తామంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరు ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. ఎస్‌సి కార్పొరేషన్ రుణాల ప్రక్రియ దరఖాస్తు దశలోనే నిలిచిపోగా, బిసి, ఇబిసి రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా సబ్సిడీ నగదు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారు.

వేలల్లో దరఖాస్తులు

2025-26 ఆర్థిక సంవత్సరంలో అర్హుల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులను ఆహ్వానించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలమంది వీటికి దరఖాస్తు చేస్తున్నా ప్రభుత్వం రుణాల మంజూరు విషయం పట్టించుకోవడం లేదు.

కాకినాడ జిల్లాలో...

బిసి కార్పొరేషన్ ద్వారా 1914 యూనిట్ల కోసం రూ.3,952 లక్షల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నారు. 31,859 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే రూ.12.84 కోట్లు విలువైన 562 యూనిట్లు మాత్రమే మంజూరు చేసినా లబ్ధిదారులకు ఇవ్వలేదు. ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. ఎప్పటికీ రుణాలు మంజూరు చేస్తారనేది నేటికీ స్పష్టత లేదు. ఇడబ్ల్యుఎస్ కార్పొరేషన్ ద్వారా 154 యూనిట్ల కోసం రూ.417 లక్షల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నారు. 2,449 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే రూ.8.44 కోట్లు విలువైన 41 యూనిట్లు మాత్రమే మంజూరు చేసారు. కాపు కార్పొరేషన్ ద్వారా 763 యూనిట్ల కోసం రూ.2,824 లక్షల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నారు. 21,454 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే రూ.5.93 కోట్లు విలువైన 238 యూనిట్లు మాత్రమే మంజూరు అయ్యాయి. ఎస్‌సి కార్పొరేషన్ రుణాల కోసం 798 యూనిట్లు లక్ష్యం కాగా 5533 మంది దరఖాస్తు చేసుకున్నారు.



తూర్పు గోదావరి జిల్లాలో...

బిసి కార్పొరేషన్ ద్వారా 1374 యూనిట్ల కోసం రూ.2,887 లక్షల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నారు. 16,408 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే రూ.5.22 కోట్లు విలువైన 234 యూనిట్లు మాత్రమే మంజూరు అయ్యాయి. ఇడబ్ల్యుఎస్ కార్పొరేషన్ ద్వారా 203 యూనిట్ల కోసం రూ.540 లక్షల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నారు. 2,211 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే రూ.0.54 కోట్లు విలువైన 20 యూనిట్లు మాత్రమే మంజూరు చేసారు. కాపు కార్పొరేషన్ ద్వారా 557 యూనిట్ల కోసం రూ.2,715 లక్షల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నారు. 8,193 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే రూ.4.53 కోట్లు విలువైన 174 యూనిట్లు మాత్రమే మంజూరు అయ్యాయి. ఎస్‌సి కార్పొరేషన్ రుణాల కోసం 891 యూనిట్లు లక్ష్యం కాగా 4,603 మంది దరఖాస్తు చేసుకున్నారు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో...

బిసి కార్పొరేషన్ ద్వారా 1394 యూనిట్ల కోసం రూ.2,954 లక్షల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నారు. 15,147 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే రూ.5.87 కోట్లు విలువైన 246 యూనిట్లు మాత్రమే మంజూరు అయ్యాయి. ఇడబ్ల్యుఎస్ కార్పొరేషన్ ద్వారా 154 యూనిట్ల కోసం రూ.417 లక్షల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నారు. 1657 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే రూ.0.24 కోట్లు విలువైన 12 యూనిట్లు మాత్రమే మంజూరు చేసారు. కాపు కార్పొరేషన్ ద్వారా 757 యూనిట్ల కోసం రూ.2,714 లక్షల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నారు. 15,644 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే రూ.4.62 కోట్లు విలువైన 158 యూనిట్లు మాత్రమే మంజూరు అయ్యాయి. ఎస్‌సి కార్పొరేషన్ రుణాల కోసం 1043 యూనిట్లు లక్ష్యం కాగా 3,295 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

'యూరియా కొరత లేదు'

ప్రజాశక్తి - కరప

జిల్లాలో ఎక్కడ యూరియా కొరత లేదని వ్యవసాయ శాఖ జెడి ఎన్. విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వాకాడ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలోని ఆర్ఎస్‌కెలు, ఫెర్టిలైజర్ షాపుల్లోనూ యూరియా నిలవలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. రైతులు యూరియాని నిలవ చేసి దాచుకోవడం వలన కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, రైతుకు ఎంత సరిపడా కావాలో అంతే తీసుకువెళ్లి ఉపయోగించుకోవాలని అన్నారు. యూరియా స్థానంలో నానో యూరియా లిక్విడ్ లభిస్తుందని, అవసరమైతే రైతులు దానిని పిచికారి చేయాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణలో ట్రాక్టర్లు, రోటోవేటర్లు, డ్రోన్లు ప్రభుత్వం రాయితీపై రైతులకు అందిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఎడి ఎ.బాబురావు మాట్లాడుతూ మండలంలో ఎలుకల మందు పంపిణీ చేయడం జరుగుతుందని, ఆయా ఆర్ఎస్‌కెలకు వెళ్లి రైతులు ఎలుకల మందును తీసుకుని ఎలుకుల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ సత్య, వాకాడ సొసైటీ అధ్యక్షులు దూడల నారాయుడు, బండారు శ్రీరాములు, కె.సురేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి - కోటనందూరు

నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం కోటనందూరులో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. కోటనందూరు సెంటర్లో మానవహారం చేపట్టారు. ఎస్‌కె.పద్మతోపాటు, ఆటో యూనియన్ నాయకులు ముక్కుడుపల్లి బాబురావు, మహమ్మద్ రఫీ, మాట్లాడారు. స్త్రీ శక్తి పథకంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధిని కోల్పోయారని అన్నారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి నెలకి రూ.26 వేలు ఇస్తే ఆటోల్లో మహిళలను ఉచితంగానే తీసుకెళ్తామని అన్నారు. అనంతరం ఇన్‌ఛార్జ్ తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నందిక సత్యనారాయణ, ఇజం కోదండరాంబాబు, తోలెం సత్యనారాయణ, కుప్ప రాజు, తోలుం అప్పారావు, డొక్కా అజయ్‌బాబు, కాంద్రకోట లోవరాజు, కాపరపు బాలు, టెక్కలి రమణ, నాగేశ్వరరావు, కిషోర్, కాకర కొండబాబు, బొడ్డు ప్రసాద్ గంగాధర్ పాల్గొన్నారు,

పట్టణ సమస్యలపై ఎంఎల్‌ఎ సమీక్ష

ప్రజాశక్తి - సామర్లకోట

అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై ఎంఎల్‌ఎ నిమ్మ కాయల చినరాజప్ప అధికారులతో సమీక్షించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో ఎంఎల్‌ఎతోపాటు, కమిషనర్ శ్రీవిద్య, ఇన్‌ఛార్జ్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి, డిఇ, ఎఇ పాల్గొన్నారు. పలు వార్డుల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ఎంఎల్‌ఎ ఆదేశించారు. జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ సంర్భంగా ఇంజనీరింగ్ కార్మికులు ఎంఎల్‌ఎను కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మఠం సెంటర్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, గోలి దొరబాబు, బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, సరోజ వాసు, మంచెం సాయిబాబు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆసుపత్రిలో బాలిక మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన వదినా, మరదళ్ళు కుటుంబాలను పలువురు పరామర్శించారు. ఏలేశ్వరం శివారు మందులు కాలనీకి చెందిన పెంద్ర లక్ష్మి(36), ఆమె చినమామ కుమార్తె పెంద్రా కుమారి ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోయి మృతి చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ హుటాహుటీనా ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబాలకు ధైర్యం చెప్పి ప్రభుత్వం నుంచి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో తహశీల్దార్ పి.ఆనంద్‌కుమార్, ఆర్ఐ ఎస్.పొన్నాలు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, పెంద్ర శ్రీను పాల్గొన్నారు.

ఇసుక తరలింపు వల్లే ప్రమాదం

ఏలేరు కాలువలో అక్రమార్కులు జెసిబిలతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలించుకుపోవడంతో ఏర్పడిన గొయ్యల వలనే ఇద్దరి నిండు ప్రాణాలు పోయాయని సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతరపు రాజు, సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి ఏలేరు కాలువలో యంత్రాలతో ఇసుక తవ్వకుండా చర్యలు చేపట్టాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎఆర్‌టి సెంటర్‌లో కేంద్ర బృందం తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం

స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని ఎఆర్‌టి కేంద్రాన్ని మంగళవారం కేంద్ర అధికారుల బృందం తనిఖీ చేపట్టింది. హెచ్ఐవి బాధితులకు అందజేస్తున్న వైద్య సేవలు, సహాయ సహకారాలు, రికార్డుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసిటిసి భాగస్వామి పరీక్షలు తప్పనిసరిగా జరిగే విధంగా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు వివరాలను సోచ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఢిల్లీ ప్రతినిధి డాక్టర్ యుబి.దాస్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ రాహుల్ ఆహుజా, డాక్టర్ జశ్విందర్ సింగ్, ఎపి ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డాక్టర్ వై.కామేశ్వరప్రసాద్, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - శంఖవరం

ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనిధి స్కూల్ విద్యార్థులు

శ్రీ నిధి స్కూల్ ఆధ్వర్యంలో దోమలపై దండయాత్ర పేరుతో అవగాహన ర్యాలీని కత్తిపూడిలో మంగళవారం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ దానం గంగమహేష్, ప్రిన్సిపల్ నాయుడు రవి మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకో వాలని, మురుగు కాలువలలో లార్వాను నాశనం చేసే బ్లీచింగ్, ఫినాయిల్ వంటి రసాయనాలు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిలయన్స్ స్కాలర్‌షిప్పులపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

మాట్లాడుతున్న రిలయన్స్ ప్రతినిధి నాగేశ్వరరావు

మండలంలోని దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ రాత పరీక్ష నిర్వహించి మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రతి ఏడాది రూ.50 వేలు చొప్పున నాలుగేళ్లపాటు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ టెస్ట్‌లో పాల్గొనాలనుకున్న విద్యార్థులు ఎలిజిబిలిటీలు ఉంటాయని, వాటిలో ఇంటర్‌లో 60 శాతం మార్కులు వచ్చి ఉండాలన్నారు. వారి వార్షిక ఆదాయం రూ.15 లక్షల వరకు ఉండవచ్చున్నారు. రూ.2.50 లక్షల దిగువ ఆదాయం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తారన్నారు. అర్హతలు కలిగిన విద్యార్థులకు త్వరలోనే టెస్టు నిర్వహిస్తామన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌నకు సంబంధించిన వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చున్నారు. ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉల్లాస్ వయోజనతో 100 శాతం అక్షరాస్యత

ప్రజాశక్తి - గొల్లప్రోలు, తాళ్లరేవు

కరపలో నిరక్షరాస్యులతో మాట్లాడుతున్న డిడి పోసయ్య

ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాల ద్వారా వయోజన విద్యతో నూరు శాతం అక్షరాస్యతను సాధించవచ్చని వయోజన విద్యా డిడి పోసయ్య తెలిపారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలో ఎస్‌సి కాలనీలోని బిఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాలు, సచివాలయం-1, 2 కేంద్రాల్లో వయోజన విద్య, మెప్మా సహకారంతో అక్షరాస్యత కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో 3583 మంది వాలంటీర్లు స్వచ్ఛందంగా వయోజన విద్యను అందించడానికి ముందుకొచ్చారని అన్నారు. సెప్టెంబర్ 8 నుంచి మార్చి నెల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ అక్షరాస్యత వయోజన విద్య అధికారి గౌస్ మొహిద్దీన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ శ్రీదేవి, కౌన్సిలర్ మైనం భవాని, వయోజన విద్య సహాయ ప్రాజెక్టు అధికారి వాసంశెట్టి త్రిమూర్తులు, గణాంక అధికారి వివిఎస్.ఆనందబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవులో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. వయోజన విద్యాశాఖ స్టేట్ రిసోర్స్‌పర్సన్ రాజేష్, మండల విద్యాశాఖ రిసోర్స్ పర్సన్ కాశి రవీంద్ర వివిధ పాఠ్యాంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం శైలేష్, ఎంఇఒ-2 ఉమ పాల్గొన్నారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన కౌలు రైతు టేకుమూడి కృష్ణ(55) పాముకాటుకు గురై మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా గడ్డిమేటి వద్ద పాము కాటు వేసింది. హుటాహుటిన యానం జిజిహెచ్‌కు తరలించగా పరిశీలించిన వైద్యులు కాకినాడ జిజిహెచ్‌కు రిఫర్ చేశారు. అయితే మార్గమధ్యంలో కౌలు రైతు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య దుర్గ, ఇద్దరు సంతానం ఉన్నారు.

కార్టూ'నిజం'



ముదునూరిని కలిసిన గిరిబాబు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


ముదునూరితో మాట్లాడుతున్న గిరిబాబు

వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజును ధర్మవరంలో నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ముదునూరి తండ్రి రామరాజుపై పెట్టిన కేసుపై తక్షణమే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. 86 ఏళ్ల వ్యక్తిపై ఒక మహిళ పెట్టిన కేసును పూర్తిస్థాయిలో విచారణ చేయకుండా కేసు నమోదు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గౌతు స్వామి, బెహర దొరబాబు, రామిశెట్టి నాని, జువ్వల బాబులు, రాపాక గుర్రాజు, రామిశెట్టి దొరబాబు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న టెక్నికల్ ట్రైనర్ వరప్రసాద్

ఆదిత్యలో ఐదు రోజుల వర్క్‌షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఎపిఎస్ఎస్‌డిసి సహకారంతో 2వ ఏడాది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డేటా సైన్స్ విద్యార్థులకు 'ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్' అనే అంశంపై ఐదు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభం అయింది. ఎపిఎస్ఎస్‌డిసి ఎగ్జిక్యూటివ్ టెక్నికల్ ట్రైనర్ ఎస్.వరప్రసాద్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్లు డాక్టర్ బి.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎ.రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి.రాజేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి.సతీష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజా అశోక్‌బాబును పరామర్శించిన యనమల

ప్రజాశక్తి - కోటనందూరు

మాజీ ఎంఎల్‌ఎ రాజా అశోక్‌బాబును టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురియైన అశోక్‌బాబు తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం అశోక్‌బాబును యనమల పరామర్శించారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కూటమి నాయకులు యనమల రాజేష్, చింతమనేడు అబ్బాయి, ఇనుగంటి సత్యనారాయణ, దంతులూరి చిరంజీవిరాజు, కుసుమంచి శోభారాణి, కుప్పడుపు బాలాజీ, మోత్కూరు వెంకటేష్ పాల్గొన్నారు.

9న గొల్లప్రోలు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ కె.స్వప్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. అధికారులంతా ఆయా శాఖలకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

ఆలిండియా రేడియో స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇసిఇ ద్వితీయ సంవత్సర విద్యార్థులు విశాఖపట్నంలోని ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. స్టేషన్‌లోని ఎఫ్ఎం ట్రాన్స్‌మీటర్, రిసీవర్, స్టూడియోలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.రాజశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కెహెచ్‌కె.రఘువంశీ పర్యవేక్షణలో విద్యార్థులు సందర్శించారు.

ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో మంగళవారం స్థానిక ఆదిత్య టాలెంట్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ ఇన్‌ఛార్జ్ బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో సైన్స్ ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీరామ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఒక వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని వద్దిపర్రు గ్రామానికి చెందిన వీరవల్లి నాగేశ్వరరావు (64) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన జీవితం మీద విరక్తి చెందిన నాగేశ్వరరావు సోమవారం పురుగుల మందు తాగాడు. వెంటనే అతని తన కుమారుడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. మంగళవారం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - సీతానగరం

బి.దొడ్డవరంలో రవణం సాయిబాబు బహిర్భూమికి వెళ్లి కాలుజారి గోదావరిలో గల్లంతు అయ్యాడు. ఈ సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇవి.. సాయిబాబు ఒలుపు కార్మికుడు. ఈ ఘటనపై ఆయన కుమారుడు పల్లమ రాజు రెవిన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సాయిబాబు ఆచూకీ కోసం రెవిన్యూ అధికారులు 2 ఇంజిన్ పడవలు ఏర్పాటు చేసి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఇంకా అతని జాడ తెలియలేదు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. ఆగస్టు 11న రావులపాలెం మండలం రావులపాడుకు చెందిన కటకం మోహన్‌రావు(52) రాజమహేంద్రవరం నుంచి స్వగ్రామం బైక్‌పై వస్తున్నారడు. ఆ సమయంలో 216ఎ జాతీయ రహదారిపై మండలంలోని జొన్నాడ ఆంజనేయస్వామి గుడి వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం అతనిని ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహన్ రావు గాయపడ్డాడు. అతనిని రాజమహేంద్రవరంలోని ప్రయవేటు ఆస్పత్రికి స్థానికులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

కోడి కత్తితో దాడి కేసులో నలుగురి అరెస్టు

ప్రజాశక్తి -గోకవరం

ఇద్దరిపై కోడి కత్తితో దాడి చేసి గాయపరిచిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. గంగవరం మండలం ఒజుబండ గ్రామానికి చెందిన కుంజం సాయి వెంకట శివ వినాయక విగ్రహం నిమజ్జనం ఊరేగింపునకు వెళుతుండగా కృష్ణునిపాలెం పంచాయతీ రామన్నపాలెం శివారు హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద గోకవరం గ్రామానికి చెందిన నలుగురు బైకులపై వచ్చి కోడి కత్తితో బెదిరించి అతని వద్దనున్న సెల్ ఫోన్ లాక్కున్నారు. అక్కడ ఉన్న కొంతమంది వారిని ప్రతిఘటించగా భరత్, రాజేష్‌లపై కోడి కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి పారిపోయారన్నారు. దీంతో నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తుతెలీని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి -కొవ్వూరు

పసివేదల -కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు రైల్వే ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు. మృతునికి 50 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. వివరాలు తెలిసిన వారు 9490617090, 9948010061 నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

హత్య కేసులో ఏడేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి -నల్లజర్ల

హత్య కేసులో చీపురుగూడెంకు చెందిన కూనపాము బాబూరావుకు ఏడేళ్ల జైలు శిక్ష పడినట్టు సిఐ బాలశౌరి తెలిపారు. 2021లో చల్లారి వెంకటేశ్వరరావు ఇంటి వద్ద కల్లు తాగేందుకు వెళ్లిన బాబూరావు డబ్బులు ఇవ్వకుండా గొడవ పడిన క్రమంలో ఇనుపు రాడ్డుతో వెంకటేశ్వరరావు తలపై కొట్టి చంపినట్టు రుజువు కావడంతో తాడేపల్లిగూడెం డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్ట్ జడ్జి షేక్ సికిందర్ బాషా బాబూరావుకు జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్టు సిఐ తెలిపారు.

మద్యం షాపు వద్ద ఘర్షణ ఒకరికి తీవ్రంగా గాయాలు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం పాత సినిమా హాలు సమీపంలో ఉన్న మద్యం షాపు వద్ద ఇద్దరు మధ్య ఘర్షణ జరిగింది. ఒక వ్యక్తిని మరో వ్యక్తి బీర్ బాటిల్తో పొడవడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. దాడి చేసిన వ్యక్తి అక్కడ నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై అన్నవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటుపై దళితుల ఆందోళన

ప్రజాశక్తి - మామిడికుదురు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అప్పనపల్లి మార్కెట్లో మంగళవారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాస్పదమైంది. దీంతో దళితులు ఆందోళన చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరును వక్రీకరించి దళితుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఫ్లెక్సీలో పేర్కొన్నారన్నారంటూ నగరం పోలీసులకు దళిత సంఘాలు ఫిర్యాదు చేశాయి. నగరం ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఫ్లెక్సీ ముద్రించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. జనసేన నేత కంకిపాటి నరసింహారావు అక్కడికి చేరుకుని ఫ్లెక్సీ చించివేశాడు. ఈ ఆందోళనలో దళిత సంఘాల నేతలు గెడ్డం కృష్ణమూర్తి, గెడ్డం వెంకటేశ్వరరావు, బొంతు చందు, నక్కా బాలకృష్ణ, బత్తుల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డిప్యూటీ సిఎం పవన్ పుట్టినరోజు

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో జనసేన పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కాజులూరులో జరిగిన పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి - యంత్రాంగం

కాజులూరు మండలంలోని కుయ్యేరు గ్రామంలో పవన్‌కళ్యాణ్ అభిమానులు కాకినాడ అంజు కంటి ఆసుపత్రి వైద్యులు తేజ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి సుభాష్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ఎఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత్‌రాయ్, అన్నం శ్రీరామచంద్రమూర్తి, టిడిపి మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి, దేవస్థానం చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జడ్‌పి పాఠశాలలో పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా 10వ తరగతిలో 500 మార్కులు దాటిన 26 మంది విద్యార్థులకు ట్రావెల్ బ్యాగ్‌లను మంత్రి వాసంశెట్టి సుభాష్ అందజేశారు. జనసేన నాయకులు అన్నం శ్రీరామచంద్రమూర్తి ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం చింతా నారాయణమూర్తి అధ్యక్షత వహించారు. పదవ తరగతిలో 510 మార్కులు తెచ్చుకొని ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న తండ్రిలేని ఒంటెద్దు నాగశ్రీ పాఠశాల ఉపాధ్యాయులు రూ.10 వేలు, దేగల సతీష్‌కుమార్ రూ.5 వేలు, మంత్రి సుభాష్ రూ.20 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు, ఆకుల రుశ్వంత్‌రాయ్ పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని మాధవపట్నం గ్రామంలో జనసేన నాయకులు పస్పిరం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు సరోజ వాసు ఆధ్వర్యంలో స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టా జానకిరామారావు, సమన్వయకర్త మంచెం సాయిబాబు, తుమ్మల ప్రసాద్, మోటూరి నగేష్, చినబాబు, అల్లిరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, బుద్ధరాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్‌నాయుడు, పి.ధర్మచంద్రరాజు, ఎస్.శ్రీగణేష్, అడబాల సత్యనారాయణ, రాజా పాల్గొన్నారు. అలాగే వాకలపూడిలోని రెడ్ క్రాస్ హోం ఫర్ సీనియర్ సిటిజెన్స్, ఎంఎల్‌ఎ పంతం నానాజీ ఆధ్వర్యంలో వృద్ధులకు పళ్ళు, కేక్, భోజనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నానాజీ కుమారుడు పంతం సందీప్ పాల్గొన్నారు. ఆశ్రమ శ్రావణి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పళ్ళు అందించారు. **యు.కొత్తపల్లి** మండలంలోని పొన్నాడ పంచాయతీ కొనపాపపేట గ్రామంలో పవన్‌కల్యాణ్ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ నాయకుడు పల్లేటి బాపనదొర ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలో ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. పేదలు, వికలాంగులకు బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల కన్నబాబు, మేడిశెట్టి సూర్య కిరణ్, గోపిశెట్టి శ్రీను, యాళ్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక కోనేటివీధి ఎపిపి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జనసేన నాయకులు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు స్వామిని మణిభాస్కర్, మరిసె రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక హోప్ ఆసుపత్రిలో జనసేన నాయకులు పలివెల వెంకటేష్, అచ్చే వీరబాబు, గంగిరెడ్ల మణికంఠ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శైలజ, టిడిపి మండల అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొద్దిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి, యండగండి నాగబాబు, తదితరులు పాల్గొన్నారు. **కరప** స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకను నిర్వహించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అల్పాహారం, రొట్టెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ అధ్యక్షుడు పేకేటి దుర్గాప్రసాద్, లకామన సురేష్, పేపకాయల తణుకులరాజు, పోలిశెట్టి తాతీలు, జోన్నాడ సూర్యప్రకాష్, మేడసాని వెంకన్న, సింగినేడి సత్యనారాయణ పాల్గొన్నారు. **తాళ్లరేవు** డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా పి.మల్లవరంలో జనసేన నాయకులు డాక్టర్ విఆర్ఎన్‌బి.ప్రసాద్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వైడి.రామారావు ప్రారంభించారు. మెగా అభిమానులు 150 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ భాగ్యశ్రీ, లయన్స్ క్లబ్ ప్రతినిధి నడింపల్లి వినోద్, ఎఎంసి మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షులు అత్తిలి బాబురావు, ఒఎన్‌జిసి ప్రతినిధి రేవతి, తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పిఠాపురం కార్తికేయ హాస్పిటల్ ఆధ్వర్యంలో బి.ప్రత్తిపాడులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ ప్రాంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ మొగలి కాశీ విశ్వనాథం, డాక్టర్ కొమ్మూరు గోవిందుబాబు, డాక్టర్ కర్రి దివ్య, డాక్టర్ ఆదినారాయణ వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊట రామకృష్ణ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కోటగుమ్మం సెంటర్ వద్ద పవన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబుపాల్గొన్నారు. కేక్‌ను కట్ చేసి పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వెంకటేశ్వర థియేటర్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి

మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు వైసిపి శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దవులూరి దొరబాబు పాల్గొన్నారు. అలాగే జి రాగంపేట రోడ్డులోని జగనన్న కాలనీ, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాల్లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గోకిన సునేత్రదేవి, ఊబా జాన్‌మోజేష్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, నాయకులు ఆవాల లక్ష్మీ నారాయణ, మన్యం చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** పట్టణంలో వైసిపి నాయకులు మొగలి అయ్యారావు, అంజూరి

సామర్లకోటలో నివాళులర్పిస్తున్న దవులూరి

రాంబాబు, జ్యోతుల భీముడు ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తెడ్లపు నాగేంద్ర, దాసం పూసలు, దివానం, మొగలి దొరబాబు, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** జగ్గంపేటలో మాజీ మంత్రి తోట నరసింహం, మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు వేర్వేరుగా వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నరసింహం, చంటిబాబు తన అనుచరులతో కలిసి ఆయన కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఒమ్మి రఘురామ్, తోట రాంజీ, ఎంపిపి చలగళ్ళ దొరబాబు, ఎంపిటిసి సభ్యులు మద్దిపట్ల రామకృష్ణ, రాజు, సర్పంచులు నకిరెడ్డి నాగేశ్వరావు, బోధిరెడ్డి చక్రరావు, ఉప సర్పంచ్ బండారు రాజా, తదితరులు పాల్గొన్నారు. **శంఖవరం** వైఎస్ఆర్ వర్ధంతిలో వైసిపిలోని గ్రూపుల పోరు బహిర్గతం అయింది. మంగళవారం సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా, మధుబాబు ఆధ్వర్యంలో కొంతమంది నాయకులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే టీ టైం సెంటర్లో మరో వర్గానికి చెందిన కొండపల్లి అప్పారావు, ఎంపిటిసి సభ్యులు సతీష్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు. దీంతో వైసిపిలోని గ్రూపుల పోరు మరోసారి చర్చానీయాంశంగా మారింది. **యు.కొత్తపల్లి** వాకతిప్పలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల

పిఠాపురంలో వైఎస్ఆర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న వంగా గీత

సుదర్శన, ఉప్పాడలో మెరుగు ఎల్లాజీ, నాగులపల్లి గ్రామంలో వడిశెట్టి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావు చిన్నారావు, కారె శ్రీనివాస్, బొందు రాంబాబు, గోగు బుజ్జి, చొక్కా సింగన్న, గంటా శ్రీనివాస్, ఉమ్మడి శ్యామ్, గొరిసే కాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **రౌతులపూడి** స్థానిక మార్కెట్ సెంటర్ ఆవరణలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, నాయకులు వాసిరెడ్డి జమీలు, తదితరులు పాల్గొన్నారు. **తుని** పట్టణంలో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు యనమల కృష్ణుడు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మార్నెడి శ్రీను, పోతల రమణ, దుంగల నాగేశ్వరరావు బత్తుల వీరబాబు, గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని రాయవరం గ్రామంలో సర్పంచ్ గుమ్ములూరు వెంకటరమణ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు పాల్గొని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్, బీశెట్టి అప్పలరాజు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, గొల్లపల్లి సురేష్ పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్, ఆసుపత్రి వీధి, సినిమా సెంటర్లలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసిమంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు కామేశ్వరరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక వైసిపి కార్యాలయంలో మాజీ సిఎం వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీత పాల్గొని వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

ఫౌంటెన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని మఠం సెంటర్లో తొలగించిన రామాలయం వద్ద వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేసే స్థలాన్ని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ఈ ఫౌంటెన్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, టిడిపి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, వల్లూరి దొరబాబు, అందుగుల జార్జి చక్రవర్తి, గోలి వెంకట అప్పారావు చౌదరి పాల్గొన్నారు.

యూరియా కోసం క్యూలో నిల్చున్న మహిళా రైతులు

యూరియా కోసం పడిగాపులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని చెందుర్తి ఆర్ఎస్‌కెకు యూరియా రావడంతో మంగళవారం రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. రైతులు మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. రైతులకు సరిపడా ఎరువులు అందించడంలో సంబంధిత అధికారులు విఫలం అవుతున్నారని రైతులు విమర్శంచారు. యూరియా కొరతను అధిగమించేందుకు పురుగు మదుల షాపుల్లో కూడా విక్రయించేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

స్వమిత్వ సర్వే పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తాటిపర్తి, చంద్రమాంపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వేను మంగళవారం డిఎల్‌డిఒ ఎం.శ్యామల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివాస గృహాల డేటా నమోదుకు సంబంధించి స్వమిత్వ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని పంచా యతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎంపిడిఒ డి శ్రీలలిత, డిప్యూటీ ఎంపిడిఒ శేఖర్‌రెడ్డి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎన్.రామకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని చెందుర్తి గ్రామంలో నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

కరప మండలంలోని పలు గ్రామాల్లో తహశీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్‌తో కలిసి కూటమి నాయకులు రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. గొడ్డటిపాలెం గ్రామ సర్పంచ్ గోన అనూష ఆధ్వర్యంలో రేషన్ షాప్ నెంబర్-3 వద్ద స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, ఎఎంసి ఛైర్మన్ ముద్రగడ రమేష్, పెనుగుదురు సొసైటీ అధ్యక్షులు రెడ్డిపల్లి నారాయణరావు, నీటి సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి గోవిందరాజులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలం జి.రాగంపేటలో రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎఎంసి డైరెక్టర్ జలదాని సుబ్రహ్మణ్యం, ఇతర నాయకులు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని జి.మేడపాడులో రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులు చౌదరి, జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ మేడపాడు సొసైటీ అధ్యక్షులు పాలకుర్తి రవిబాబు, అనపర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ఛైర్మన్ గోలి కృష్ణమూర్తి జనసేన నాయకులు జానా శ్రీనివాస్ కంచుమర్తి రాజన్న, జానా వెంకట్రావు పాల్గొన్నారు. **రౌతులపూడి** స్థానికంగా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి పాల్గొని లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బలరామపురంలో ఎంపిటిసి శ్రీసోమరౌతు రవి, సర్పంచ్ పైల సీత స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు పైల్ నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని పి.నాయకంపల్లి గ్రామంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌విఎస్. అప్పలరాజు, పోతుల మోహన్‌రావు, కుంచే రాజా, పాలకుర్తి ఆదినారాయణ, కందుల చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

'వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి'

ప్రజాశక్తి - యానాం

మీడియాతో మాట్లాడుతున్న రత్నాకర్

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటానికి మాలలు సిద్ధం కావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్.రత్నాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం యానాం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వర్గీకరణకు కుట్ర చేసిందన్నారు. ఎస్‌సి వర్గీకరణకు నాటి కాంగ్రెస్ పార్టీ పంజాబ్, హర్యానాలో బీజం వేస్తే నేడు మోడీ దేశం మొత్తం చేశారని విమర్శంచారు. వందలో కేవలం నలుగురికి లబ్ధి కలిగే ఎస్‌సి వర్గీకరణ ఫలాలు దేశవ్యాప్తంగా ఎస్‌సి జాబితాలో ఉన్న 1108 కులాలకు కేవలం 4 సీట్లను ఎలా పంచుతారని ప్రశ్నించారు చంద్రబాబు మాల సామాజికవర్గంపై పగ తీర్చుకుంటే, మాలలకు అన్యాయం జరుగుతున్నా మాలల మేనమామ జగన్ ఈ నాటికి స్పందించలేదని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని అణిచివేసేందుకు పాలకపక్షాలతో చేతులు కలిపాయని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో బూల బాలు, కమిడి దత్తు, తదితరులు పాల్గొన్నారు.

9వ రోజుకు మున్సిపల్ సిబ్బంది అందోళన

ప్రజాశక్తి - యానాం

నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

స్థానిక జెండా స్తంభం వద్ద బకాయి వేతనాలు చెల్లించాలని మున్సిపల్ సిబ్బంది చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ తక్షణమే తమ బకాయి వేతనాలు చెల్లించాలని, సెవెంత్ పే పెండింగ్ విడుదల చేయాలని కోరారు. రిటైర్ అయిన వారికి పూర్తిగా క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.

పరిపాలనాధికారికి ఘన సత్కారం

ప్రజాశక్తి - యానాం

యానాం దళిత ఐక్యవేదిక, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పరిపాలనాధికారి మునిస్వామిని ఘనంగా సత్కరించారు. మంగళవారం స్థానిక బుద్ధా పార్క్‌లో సత్కార కార్యక్రమం జరిగింది. సభాధ్యక్షులు కలైమామని అవార్డు గ్రహీత పొనుగుమట్ల విష్ణుమూర్తి పాల్గొని మాట్లాడారు. యానాం ప్రాంతంలో గుర్తుండిపోయే కార్యక్రమాలను మునిస్వామి చేశారని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎక్కువ సమయం కేటాయించారని అన్నారు. ఈ కార్యక్రమంలోరిటైర్డ్ అండర్ సెక్రెటరీ గిడ్డి బలరాం, రిటైర్డ్ ఆర్ఎఒ నామాడి అప్పారావు, న్యాయవాది కమిడి విజయకుమార్, తిరుకోటి నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం మునిస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుర్రపు ప్రహ్లాదుడు, పాము సత్యనారాయణ, కొంకే రవికుమార్, పువ్వల వెంకట్రావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

మాజీ సిఎం వైఎస్ఆర్‌కు యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం స్థానిక నల్లచెరువు సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పిడబ్ల్యూడి ఇఇ నాగరాజు, సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

గండేపల్లిలో మాట్లాడుతున్న ఎడి శ్రీనివాస్

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన

ప్రజాశక్తి - గండేపల్లి, కోటనందూరు

గండేపల్లి మండల వ్యాప్తంగా బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మల్లేపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుకల నిర్మూలన కొరకు బుధవారం చేపడుతున్న కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలుకల వల్ల పంటలకు ఏర్పడే నష్టం చాలా అధికంగా ఉంటుందని, వాటిని సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ పి.చంద్రమౌళి, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు ఎన్.ప్రత్యూష, రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు. కోటనందూరు మండలంలోని కెఇ.చిన్నయ్యపాలెం, పి.కొట్టం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కెజే.చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. వరి నాట్లు వేసే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో తుని ఎఎంసి ఛైర్మన్ రమేష్, ఎఇఒ జగ్గ అప్పారావు, విహెచ్‌ఎ సాయి, రైతులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.24/2016 in O.S.88/2009
Between:
గోళ్ళ నూకరాజు ...DHr
And
రేలంగి కనకరత్నం ...JDr
DHr అయిన గోళ్ళనూకరాజు గారు JDr అయిన రేలంగి కనకరత్నం, W/o. సూర్యనారాయణ, ధర్మవరము గ్రామము, ప్రత్తిపాడు మండలము అను వారిపై గౌరవనీయ ప్రత్తిపాడు జూనియరు సివిలు E.P.24/2016 in O.S.88/2009 అను కేసును దాఖలు చేసారు. ఆ కేసులో JDr అయిన రేలంగి కనకరత్నం కోర్టు వారి నుండి ఎన్నిసార్లు నోటీసులు, సమన్లు పంపినా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున JDr హాజరుకై కోర్టు వారు **ది.04-9-2025** వ తేదీన వాయిదా వేసియున్నారు. **ది.04-9-2025** వ తేదీన ఉదయం **గం|| 10.30 ని||లకు** JDr స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియచేయవలెనని, లేని ఎడల JDr పరోక్షమున కేసు తీర్మానించబడునని కోర్టు వారి ఆర్డరుపై తెలియచేయడమైనది.
ఆడారి సుగుణ
అడ్వకేటు ప్రత్తిపాడు,
సెల్: 9866045389

పబ్లిక్ నోటీసు
నా క్లయింటు శ్రీ **మానుకొండ రాఘవేంద్ర రావు గారి** సంజాయిషీ పై యావన్మందికీ తెలియచేయునది ఏమనగా, నా క్లయింటు యొక్క ఆస్తికి సంబందించిన ఒరిజినల్ రిజిష్టర్డ్ దస్తావేజులు **1) 1/2004 మరియు 2) 5767/2007 రు, ది.04/08/2025 వ తేదీన** కాకినాడ సర్పవరం జంక్షన్, మహేంద్ర స్వీట్‌స్టాల్ సందులోగల ఆయన హాస్పటల్ "రాఘవేంద్రా చెస్టు క్లీనిక్" నుండి SRMT Mall దగ్గరలో గల Xerox షాపులో కాపీలు తీయించుటకు వెళ్ళుచుండగా మార్గమధ్యంలో పడిపోయినవి యివి ఎవరికైనా దొరికిన చో ఈ క్రింది ఎడ్రస్‌కు తెలియచేయవలెను, తగిన బహుమతి యివ్వబడును. ఒకవేళ దొరికిన వారు సదరు దస్తావేజులతో మిస్‌లీడ్ చేసిన యెడల నా క్లయింటును బైండు చేయవని తెలియచేయడమైనది.
గెడ్డం శ్రీనాథ్ అడ్వకేట్
#69-6-43/3, రాజేంద్ర నగర్, న్యూ గైగోలుపాడు, కాకినాడ,
సెల్: 94401 12384, 79891 09046

PUBLIC NOTICE
(Correction of Candidate and Parent Names in ICSE Records - 2025)
Public Notice is hereby given on behalf of **Ms. Shaik Mohammad Nafisa,** daughter of **Sri Shaik Javurrehman** and **Smt. Beebi Sajida,** a student of **St.Joseph's Convent School, Kakinada (AP024),** who appeared for the **ICSE Class X Examination - 2025 under Unique ID: 8601583 and Index No. 1255186/055;** has been issued a **Pass Certificate Cum Statement of Marks (Certificate No. TY 40242158)** that incorrectly records her name and parentage as:
1. Candidate: Mohammad Nafisa
2. Mother: Sajida Begum
3. Father: Ziaur Rehman
As per the Officeial **Birth Certificate, (ID: 53301-B-352327)** Issued by Kakinada Municipal Corporation, Andhra Pradesh, the Correct details are:
1. Name: "SHAIK MOHAMMAD NAFISA"
2. Mother: "BEEBI SAJIDA"
3. Father: "SHAIK JAVURREHMAN"
All concerned authorities are requested to amend the official records accordingly. The undersigned parents **indemnify and hold harmless** CISCE, New Delhi, and St. Joseph's Convent School, Kakinada, from any claims arising from these corrections.
objections, if any, must be lodged **in writing within seven (7) days** of publication to the undersigned. In the absence of objection, the corrections will be effected.
KARRA VENU, ADVOCATE
D.No. 21-5-16/4, Indanavari Street
Salipeta, KAKINADA. Cell: 9849548272

IN THE COURT OF THE VIITH JUNIOR CIVIL JUDGE RAJAMAHENDRAVARAM
OS.No.528 of 2024
Between:-
Thota Parvathi
Thota Ramu ...**Plaintiffs**
And
1. Khandavalli. Bapanamma
2. Chintapalli. Madhusudhn reddy Chintapalli. Madhusudhana reddy, C/o chintapalli. Manikyam, Hindu, aged 36 years, D. N. 85-51-181,flat. No. G -1,Model colony,V. L. Puram putas primavera,. Rajamahendravaram. E.G. District.
3. Devani. Balaji
4. K. P. A. Pradeep ...**Defendents**
To.
D.No.2: Chintapalli. Madhusudhana reddy, C/o chintapalli. Manikyam, Hindu, aged 36 years, D. N. 85-51-181,flat. No. G-1, Model colony, V.L.Puram putas primavera,. Rajamahendravaram. E.G. District.
Where as the above named plaintiffs haa instituted a injunction suit against defendents. The defendent No. 2 is here by summoned to appear un the court in person or by a pleader duly instructed and above to answer all material question relatingto the suit or who shall be accompanied by in person on the day to **4-09-2025 at 10.30** a.m in the forenoon to answer the claim and at the day fixed for your appearance is appointed for the final disposal of the suit defendent No.2 must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which defendent No. intend to real in support defendent No. 2 defense The plaintiffs filed the above original suit for injunction against defendents. Defendent No. 2 and the said matter is posted to **dt. 4-09-2025** for defendent No. 2 appearance. You are therefore thereby directed to appear before the court on the above said dateat. **10.30 A.M** either in person or through your counsel, failing whichthe matter will be decided in your absence as per law.
(By order of the Honourable court)
Sujatha Sesetti
Advocate
Rajamahendravaram